నేడు ఆది శంకరాచార్య హరికథా గానం

మియాపూర్‌: మియాపూర్‌ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో వ్యాసపూర్ణిమ సందర్భంగా జగద్గురు శంకరాచార్య హరికథా గానం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్లు ధర్మపురి క్షేత్రం నిర్వాహకులు భారతీయం సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. నేమాని నాగలక్ష్మీ భగవతారిణిచే జగద్గురు శంకరాచార్య హరికథా గానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డా.కల కృష్ణ, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. ఉమామహేశ్వరి హాజరవుతారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ట్రిపుల్‌ఐటీ బస్టాప్‌లో మొబైల్‌ బస్‌పాస్‌ కౌంటర్‌

రాయదుర్గం: ఐటీ ఉద్యోగులు, బస్‌ ప్రయాణికుల సౌకర్యార్థం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మొబైల్‌ బస్‌పాస్‌ కౌంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ట్రిపుల్‌ఐటీ కూడలిలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఆదివారం సెలవు.

22 నుంచి న్యాక్‌ శిక్షణా తరగతులు ప్రారంభం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ కన్‌స్ట్రక్షన్‌ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్‌ గ్రాడ్యుయేట్లకు ఈ నెల 22 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. జనరల్‌ కేటగిరి బీఈ, బీటెక్‌ సివిల్‌ ఇంజనీరింగ్‌ గ్రాడ్యుయేట్ల కోసం 3 నెలల ప్లేస్‌మెంట్‌ లింక్డ్‌ పేమెంట్‌ ఫినిషింగ్‌ స్కూల్‌ ప్రోగ్రామ్‌ను, ఎస్సీ, బీసీ, సీ వర్గానికి చెందిన బీఈ, బిటెక్‌ సివిల్‌ ఇంజనీరింగ్‌ గ్రాడ్యుయేట్ల కోసం 3నెలల ప్లేస్‌మెంట్‌ లింక్డ్‌ పేమెంట్‌ ఫినిషింగ్‌ స్కూల్‌ ప్రోగ్రాంను ఎస్సీ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, భోజన వసతి, 100శాతం ప్లేస్‌మెంట్‌ను కల్పించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్‌ 9505631765లలో సంప్రదించ వచ్చు.

మండల్‌ కమిషన్‌ సూచనలను అమలు చేయాలి

రాయదుర్గం: 'మండల్‌ దివాస్‌' కార్యక్రమాల నిర్వహణకు ఆగష్టు 7వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ (ఏఐఓబీసీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ శనివారం తెలిపారు. ముఖ్యంగా మండల్‌ కమిషన్‌ సూచనలను అమలు చేయాలని, కుల గణన చేయాలని, 52 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఉన్నత విద్యాసంస్థలలో రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నేషనల్‌ ఫెలోషిప్స్‌ను ఓబీసీలకు రూ.1000 నుంచి రూ.5వేలకు పెంచాలని డిమాండ్‌ చేస్తూ 'చలో ఢిల్లీ'ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఓబీసీలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

వర్షం.. ఇబ్బందులు



శేరిలింగంపల్లి: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం కురుస్తూనే ఉంది. దీంతో శేరిలింగంపల్లిలోని కాలనీలు, బస్తీల అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్ళే వారు కొంత ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తలేదు.

మొక్కలు నాటిన విద్యార్థులు



గచ్చిబౌలి: వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. శనివారం బొటానికల్‌ గార్డెన్‌, మాదాపూర్‌ పీఎస్‌ ఆవరణలో నారాయణ స్కూల్‌ విద్యార్థులు మొక్కలు నాటారు. నాలెడ్జి సిటీలోని మాదాపూర్‌ ట్రాఫిక్‌ పీఎస్‌లో ప్లకార్డులతో పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్‌ నారాయణ స్కూల్‌ హెచ్‌ఎం రోహిణి, ప్రియాంక, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌మేలో ఉచిత శిక్షణ

వెంగళరావునగర్‌: యూసుఫ్‌గూడలోని నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ మైక్రో స్మాల్‌ అండ్‌ మీడియం ఎంటర్‌ ప్రైజెస్‌ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థలో యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు అసోసియేట్‌ ఫ్యాకల్టీ మెంబర్‌ వి. స్వప్న తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిమ్స్‌మే ఈ ట్రైనింగ్‌ ఏర్పాటు చేసిందన్నారు. టెన్త్‌, ఇంటర్‌, డిగ్రీ చదివి వయసు 18- 35 ఏళ్ళలోపు ఉన్న యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. మేకప్‌ ఆర్టిస్ట్‌, క్రాఫ్ట్‌ బేకర్‌, గ్రాఫిక్‌ డిజైనర్‌, టైలర్‌, యానిమేషన్‌, జూనియర్‌ సాఫ్ట్‌వేర్‌ డెవలపర్‌, క్లౌడ్‌ కంప్యూటింగ్‌ జూనియర్‌ అనలిస్ట్‌, ఏఐ అండ్‌ ఎంఎల్‌, జూనియర్‌ టెలికాం డేటా అనలిస్ట్‌, మెషిన్‌ లెర్నింగ్‌ ఇంజినీర్‌, అకౌంట్స్‌ ఎగ్జిక్యూటివ్‌, కంపోజిటర్‌, మీడియా డెవలపర్‌, అప్లికేషన్‌ డెవలపర్‌ (వెబ్‌/మొబైల్‌), వీఎఫ్‌ఎక్స్‌ ఎడిటర్‌ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్‌ ఫొటోలు, ఐడీ ప్రూఫ్‌, ధృవీకరణ పత్రాలను నిమ్స్‌మే క్యాంపస్‌లో ఇవ్వాలని సూచించారు. పూర్తి వివరాలకు 040-2363 3244/ 217/218 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అలుగు పారుతున్న వనం చెరువు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని వనం చెరువు అలుగు పారుతోంది. శేరిలింగంపల్లి పరిధి నల్లగండ్ల ప్రాంతంలోని పలు కాలనీలకు చెందిన మురుగు నీరు నిత్యం వనం చెరువులోకి చేరుతుంది. కాగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో చెరువు అలుగు పారుతుంది.





ఆల్విన్‌కాలనీలోని పరికి చెరువు నాలా పక్కన ఏపుగా పెరిగిన మొక్కలు

భయం.. భయం

పాములు వచ్చినా పట్టించుకోరా?

- నాలా పరీవాహక ప్రాంతంలో ఏపుగా చెట్ల పొదలు
- విష సర్పాలకు ఆవాసంగా మారిన వైనం
- ఆందోళనలో కాలనీల వాసులు

ఆల్విన్‌కాలనీ: కాలనీలలోకి విష సర్పాలు వస్తుండటంతో ప్రజలు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్‌, తులసినగర్‌, షిరిడీ నగర్‌లో పాములు, తేళ్లు , విష సర్పాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆల్విన్‌ కాలనీలో ఉన్న పరికి చెరువు నాలా గుండా చెట్ల పొదల నుంచి కాలనీలోకి సర్పాలు ప్రవేశిస్తున్నాయి. చెరువు కట్టపై దట్టమైన పొదలు విష సర్పాలకు ఆవాసంగా మారాయని కాలనీ వాసులు తెలిపారు. నాలాలో ఎలుకలు పెట్టిన సొరంగాలలో సర్పాలు చేరడంతో రాత్రి అయితే చాలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నాలాలో



పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించటానికి జీహెచ్‌ఎంసీ అధికారులు జేసీబీల ద్వారా చెత్తను గట్టుపైకి చేర్చాల్సి ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో మాత్రమే చెత్తను తరలించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల సమస్య ఉన్న ప్రాంతంలో సంబంధిత జేసీబీ కాంట్రాక్టర్లు చెత్తను తొలగించకపోవటంతోనే కలుపు మొక్కలు ఏపుగా పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారిందని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీధి దీపాలు వెలగక చిమ్మచీకటి

నాలా చుట్టూ వీధి దీపాలు వెలగకపోడంతో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉంటుంది. విషసర్పాల భయంతో అక్కడి నుంచి రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా నాలాకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్ల పొదలను తొలగించాలని, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కనువిందు.. నృత్యప్రదర్శన



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్య బృందం నృత్యప్రదర్శనతో అలరించారు. గురువందన, శ్లోకాలు, జతులు, మూషికవాహన, పుష్పాంజలి, బ్రహ్మాంజలి, శివస్తుతి, రామాయణశబ్దం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.అనంతరం 200 మంది కళాకారులతో గురువందనం చేశారు. కార్యక్రమంలో హిందూసేవా సమితి రాధాకృష్ణ, నాట్యగురువు కోక విజయలక్ష్మీ, డాక్టర్‌ పేరిణి రవితేజ, జానపద సంగీత గాయకులు విద్యారణ్యచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో వర్గ పోరు

గాంధీ ప్రసంగానికి అడ్డు తగిలిన కార్యకర్తలు

గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీలో వర్గ పోరు బయటపడింది. శనివారం గోపన్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లైఓవర్‌ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతుండగా స్టేజీ ఎదురుగా ఉన్న కొందరు కార్యకర్తలు జై జగదీశ్వర్‌గౌడ్‌ అంటూ నినాదాలు చేసి ప్రసంగానికి అడ్డుతగిలారు. గత అసెంబ్లీ ఎన్నికలలో జగదీశ్వర్‌గౌడ్‌ కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో నిలిచి గాంధీ చేతిలో ఓటమీ పాలయ్యారు. కాగా గాంధీ కాంగ్రెస్‌ పార్టీలోకి రావడం జగదీశ్వర్‌గౌడ్‌ వర్గానికి ఇష్టం లేదు. పైగా జగదీశ్వర్‌గౌడ్‌ను ఆలస్యంగా స్టేజి పైకి పిలవడంతో నినాదాలు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా నినాదాలు చేయడంతో పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. స్టేజీ మీద ఉన్న జగదీశ్వర్‌ గౌడ్‌ నినాదాలు వద్దని వారించినా అనుచరులు హడావిడి చేశారు. సీఎం మాత్రం అన్ని గమనిస్తూ ఉండిపోయారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

మియాపూర్‌: మియాపూర్‌, ముజఫర్‌ అహ్మద్‌నగర్‌లో ఈ నెల 23, 24వ తేదీలలో జరగనున్న ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్‌ అన్నారు. శనివారం ముజఫర్‌ అహ్మద్‌నగర్‌లో నిర్వహించిన ఎంసీపీఐ(యూ) గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రస్తుత రాజకీయ పరిణామాలలో భవిష్యత్‌ కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌

ఎడ్యుకేషన్‌ కిట్స్‌ అందజేత

పటాన్‌చెరు టౌన్‌: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెడ్వాన్‌ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్‌ మధుసూదన్‌ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల , ఐనోల్‌ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలలో పార్కర్‌ హనీ ఫిన్‌ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్‌ స్వచ్ఛంద సంస్థ వారు ఎడ్యుకేషన్‌ కిట్స్‌, ఆటవస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



రాకపోకలు ఎలా..



జిన్నారం మండలంలోని ఆయా గ్రామాలను కలుపుతున్న రోడ్లతో పాటు పారిశ్రామికవాడల రోడ్లు వర్షాల కారణంగా గుంతలమయంగా మారాయి. గడ్డపోతారం, బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లోని రోడ్లు అధ్వానంగా మారాయి. శివానగర్‌ నుంచి చిన్నకంజర్ల వరకు ఉన్న రోడ్డు గుంతలుపడింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులను చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

శ్రమ, పట్టుదలతో కార్యసిద్ధి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హఫీజ్‌పేట్‌: శ్రమ, పట్టుదలతోనే సాధ్యం కానీ గొప్ప గొప్ప పనులు సుసాధ్యం అయ్యాయని చేవెళ్ల పార్లమెంట్‌ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. భారతదేశ ఖ్యాతిని పెంపొందించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. శనివారం చందానగర్‌ క్రిస్టల్‌ గార్డెన్స్‌లో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం, శేరిలింగంపల్లి నియోజకవర్గ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెంట్‌ ఎమ్మెల్యే అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్‌ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ తనను భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, రవికుమార్‌ యాదవ్‌లు మాట్లాడుతూ రానున్న పంచాయతీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా పని చేస్తే వంద శాతం విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్‌ రాఘవేంద్రరావు, కో కన్వీనర్‌ మణిభూషణ్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రరావు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేష్‌, నరేందర్‌రెడ్డి, ప్రేమ్‌ మహేందర్‌రెడ్డి, పవన్‌, అశోక్‌ ,మహిళా మోర్చా, యువ మోర్చా, డివిజన్‌ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అలరించిన ఆంధ్రనాట్యం



మాదాపూర్‌: కళాకారులు సంకీర్తనలతో, ఆంధ్రనాట్యంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు. అన్నమాచార్య భావన వాహిని శిష్యబృందం ధన్యోస్మీ, పద్మశ్రీ, అక్షయ, అశ్రిత, పూర్వజ్‌, నారాయణి, మారుతి, విజయలక్ష్మీ, శశికళ, అంబిక, సాయి రనివ్రతరెడ్డిలు సంకీర్తలను ఆలపించారు కీబోర్డు రాజు, తబలాపై నోవా వాయిద్య సహకారాన్ని అందించారు. శ్రీభాస్కర్‌ డ్యాన్స్‌ అకాడమీ గురువు సాత్విక శిష్యబృందం లక్ష్మీప్రణతి, శ్రీహిత, ధనిష్క, జాహ్నవి, హాసిని, శరణ్య, తనుశ్రీ, నవ్య, షన్విక సంయుక్తంగా శివోహం, గురుఅష్టకం, దశావతారం, శబ్దం (ఆంధ్రనాట్యం) కీర్తనలకు నృత్యరూపకంతో అలరించారు. అనంతరం డాక్టర్‌ శోభరాజు తమ సందేశాన్ని అందించారు. సత్సంకల్ప ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు శ్రీధర్‌ తాళ్ళపాక ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

పరామర్శ



హఫీజ్‌పేట్‌: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటనలో భుజం శస్త్ర చికిత్స చేసుకున్న పీఆర్‌కె ఆసుపత్రి అధినేత పుట్ట రవికుమార్‌ను శనివారం చందానగర్‌లోని పీఆర్‌కె ఆసుపత్రిలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌ పరామర్శించారు.

నేడు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో 'గురుపూర్ణిమ'

రాయదుర్గం: గురుపూర్ణిమను పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటకు కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తారు. దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ కార్యక్రమం, పుష్పార్చన, సాయిచాలీసా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుంది. సాయంత్రం సంధ్యా హారతి, పల్లకిసేవ, ఊయల సేవ, శేజ్‌ హారతితో వేడుకలను ముగిస్తారు.

అన్నదానం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్‌-2 లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా భ్రమరాంబ అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో మహా ప్రసాదాన్ని తయారు చేసి శనివారం భక్తులకు వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహా ప్రసాదాన్ని స్వీకరించారు.

బ్యాంకు నుండి కాల్‌ చేస్తున్నామంటూ.. సైబర్‌ మోసం

పటాన్‌చెరు టౌన్‌: క్రెడిట్‌ కార్డ్‌ అప్‌ డేట్‌ అంటూ ఓ వ్యక్తిని సైబర్‌ నేరగాళ్లు మోసం చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్‌ ఉద్యోగికి ఈ నెల 3వ తేదీ అపరిచిత వ్యక్తులు బ్యాంక్‌ నుండి కాల్‌ చేస్తున్నామని క్రెడిట్‌ కార్డ్‌ అప్‌డేట్‌ చేయాలని చెప్పడంతో బాధితుడు తన వివరాలను చెప్పడంతో పాటు తన ఫోన్‌ కొచ్చిన ఓటీపీ చెప్పాడు. దీంతో అతని ఖాతాలో ఉన్న రూ. 45 వేలు డ్రా అయినట్టు మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ లో శనివారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

పటాన్‌చెరు శ్రీనగర్‌ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి బ్లూ డ్రాఫ్ట్‌ కొరియర్‌ నుండి కాల్‌ చేస్తున్నామని ఈనెల 14వ తేదీన ఫోన్‌కాల్‌ వచ్చింది. దీంతో బాధితులు అపరిచిత వ్యక్తి అడిగిన వివరాలు చెప్పడంతో అతని ఖాతాలో ఉన్న రూ. 15 వేలు డ్రా అయినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందు సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్ల పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని నవోదయ కాలనీలో రూ. 20 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డుపై నీరు నిలవకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్‌, షౌకత్‌ ఆలీ మున్నా, యాదగిరి,సయ్యద్‌, రాజిరెడ్డి, శివశంకర్‌రావు, మదన్‌, కిషోర్‌ రెడ్డి, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవి కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. నేలకూలిన చెట్టు

ఫిలింనగర్‌: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఫిలింనగర్‌లోని అపోలో మెడికల్‌ కాలేజీ ఆస్పత్రి గేటు ముందు శనివారం తెల్లవారుజామున ఓ చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్‌ స్తంభించింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడం.. ట్రాఫిక్‌తో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళి చెట్టును కట్‌ చేసి రెండు గంటల్లో పరిస్థితిని చక్కదిద్దారు.